www.nagaranijam.com
PRGI/RNI NO: APTEL/2013/54450




# నగరనిజం

www.nagaranijam.com
అక్షరనిజం నగరనిజం
తెలుగు దిన పత్రిక
NN TV TELANGANA నగర నిజం

సంపుటి : 14 | సంచిక :37 | ఉమ్మడి రంగారెడ్డి | సంపాదకులు : ఏలె. పురుషోత్తం | 29 బుధవారం, ఏప్రిల్ 2026 | పేజీలు : 4+ | ₹ 3
Volume : 14 | Issue : 37 | Rangareddy | Editor : Yela.Purushotham | 29 Wednesday, APRIL 2026 | Pages : 4 + | Price : 3/-
Published From Rangareddy,Circulated by Hyderabad, Nalgonda, Khammam, Karimnagar, Warangal, Mahaboobnagar, Medak, Nizamabad, Adilabad

## రాయపోల్ గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి





- పదేళ్లల్లో బీఆర్ఎస్ ఒక్క రేషన్ కార్డు ఇచ్చిన పాపాన పోలేదు
- రెండేళ్లలో గ్రామానికి 1147 రేషన్ కార్డులు, 47 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం
- పార్టీలో చేరిన వారికి, కష్టపడ్డ వారికి సముచిత స్థానం ఉంటుంది
- ఇబ్రహీంపట్నం శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి
- రూ.4 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు,ప్రారంభోత్సవాలు
- కాంగ్రెస్ పార్టీలో చేరిన రాయపోల్ సర్పంచ్ అచ్చన మమత శ్రీశైలం

**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 28 ( నగరనిజం ) :** రాయపోల్ గ్రామాన్ని ప్రగతి పథంలో నడిపేందుకు కృషి చేస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండల పరిధి లోని రాయపోల్ గ్రామంలో రూ. 4 లక్షల రూపాలయలతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి శంకుస్థాపనలు,ప్రారంభోత్సవాలు చేశారు. ముందుగా రాయపోల్ గ్రామ సర్పంచ్ అచ్చన శ్రీశైలం మమత, పలువురు కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం గ్రామపంచాయతీ ఆవరణంలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అందిస్తోందని అన్నారు. గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామానికి 1147 రేషన్ కార్డులు, 47 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు వివరించారు. త్వరలో 60 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి, ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి కాంగ్రెస్ పార్టీకి ఆకర్షితులవ్వడం హర్షణీయం అన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్దే కాంగ్రెస్ ప్రభుత్వం యొక్క లక్ష్యమని అన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేసే ప్రతి ఒక్కరికీ పార్టీలో సముచిత స్థానం ఉంటుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలో అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తుందని తెలిపారు. ఉచిత బస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. గత పదేళ్ల కాలంలో గత ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. గ్రామంలోని ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. రాయపోల్ సర్పంచ్ అచ్చన మమత శ్రీశైలం చేరికతో స్థానికంగా కాంగ్రెస్ మరింత బలోపేతం అవుతుందని నాయకులు అభిప్రాయపడ్డారు. గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పట్ల పెరుగుతున్న మద్దతు రాబోయే రోజుల్లో నియోజకవర్గ రాజకీయాల్లో కీలక మార్పు నాంది పలుకుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, వైస్ చైర్మన్ మంకాల కరుణాకర్, సీనియర్ నాయకులు ఈసీ శేఖర్ గౌడ్, కొత్తకుర్మ శివకుమార్, మాజీ జెడ్పీటీసీ మహిపాల్, మాజీ సర్పంచ్ పాశం అశోక్ గౌడ్, ముకునూర్ సర్పంచ్ సన్నాయిల శిల్పా ప్రేమాకర్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### రాయపోల్ గ్రామాన్ని ప్రగతి పథంలో నడిపిస్తా

రాయపోల్ గ్రామాన్ని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో ప్రగతి పథంలో నడిపేందుకు కృషి చేస్తానని సర్పంచ్ అచ్చన మమత శ్రీశైలం అన్నారు. అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, అందుకే తాము గ్రామాభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధిలో ముందుకు పోతామని చెప్పారు. ప్రజల నమ్మకాన్ని విశ్వాసాన్ని వమ్ము చేయకుండా చిత్తశుద్ధితో నిస్వార్థంగా గ్రామ ప్రజలకు సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అభివృద్ధి ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డితోనే సాధ్యమని అన్నారు. గ్రామానికి ఎమ్మెల్యే సహకారంతో అధిక నిధులు వెచ్చించి, గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని తెలిపారు. గ్రామాభివృద్ధికి గ్రామస్తులంతా సహకరించాలని సర్పంచ్ కోరారు.

## తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా సీవీ ఆనంద్?



హైద్రాబాద్ ఏప్రిల్ 28 ();తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా సీవీ ఆనంద్?ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత డీజీపీ శివధర్‌రెడ్డి ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు. 1991 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పదవి నుంచి బదిలీ అయ్యారు. హెడ్ ఆఫ్ పోలీస్ ఫోర్స్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా రెండు విడతల్లో సేవలు అందించారు. ఇటీవలే యూపీఎస్సీ డీజీపీ పోస్టుకు అర్హులైన ఐపీఎస్‌ల జాబితాను తెలంగాణ ప్రభుత్వానికి పంపించిన సంగతి తెలిసిందే. అందులో సీవీ ఆనంద్‌తోపాటు 1994 బ్యాచ్‌కు చెందిన వినాయక్ ప్రభాకర్ ఆప్టే, సౌమ్యమిశ్రా ఉన్నారు. ఈ ముగ్గురిలో అత్యంత సీనియర్ అయిన సీవీ ఆనంద్‌ను డీజీపీగా ప్రభుత్వం నియమించింది.

## కేపీహెచ్బీ బస్టాండ్ వద్ద ఆర్టీసీ కార్మికుల ఆందోళనలకు ముగింపు

- సీఎం చిత్రపటానికి పాలాభిషేకం




**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 28 (నగర నిజం ప్రతినిధి):** ప్రతి పేదవాడి ఆకాంక్షను నెరవేర్చే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ గారు పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికుల 32 ప్రధాన డిమాండ్లను ఏకకాలంలో అంగీకరించి, సమ్మెకు ముగింపు పలికినందుకు కృతజ్ఞతగా మంగళవారం కేపీహెచ్బీ కాలనీ బస్టాండ్ వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సతీష్ రెడ్డి గారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బండి రమేష్ గారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం సమ్మె సమయంలో మృతిచెందిన శంకర్ గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బండి రమేష్ గారు మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న ఆర్టీసీ కార్మికుల సమస్యలను కేవలం రెండు రోజుల్లోనే పరిష్కరించడం ప్రభుత్వ కట్టుబాటుకు నిదర్శనమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి నిర్ణయాన్ని ఆయన ప్రశంసించారు. గత ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించిన ఆయన, శంకర్ గౌడ్ తీసుకున్న తీవ్ర నిర్ణయం బాధాకరమని పేర్కొన్నారు. అతని కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల సహాయం అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న కార్మికులు, కాంగ్రెస్ నాయకులు "రేవంత్ రెడ్డి జిందాబాద్", "కాంగ్రెస్ పార్టీ జిందాబాద్" అంటూ నినాదాలతో ప్రాంగణాన్ని మార్మోగించారు.

## మియాపూర్‌లో శుభాకాంక్షల సందడి

- పెళ్లి ఆహ్వానం అందజేసిన నాయకులు



**కుత్బుల్లాపూర్, 28 (నగర నిజం ప్రతినిధి):** మియాపూర్ డివిజన్‌లో శుభకార్యాల సందడి నెలకొంది. యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఒ చైర్మన్, మియాపూర్ డివిజన్ జనరల్ సెక్రటరీ శ్రీ యలమంచి ఉదయ్ కిరణ్ గారు, ప్రేమ్ కుమార్, సతీష్, రత్నాచారి లతో కలిసి శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మరియు టీపీసీసీ జనరల్ సెక్రటరీ గౌరవనీయులు శ్రీ జగదీశ్వర్ గౌడ్ గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మియాపూర్ డివిజన్ పరిధిలోని హెచ్ఎంటీ కాలనీకి చెందిన ప్రేమ్ కుమార్ గారి సోదరి వివాహానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను సాదరంగా అందజేశారు. ఆనందోత్సాహాలతో నిండిన ఈ శుభసందర్భంలో, నాయకుల మధ్య స్నేహభావం మరింత బలపడింది. అలాగే, శ్రీ జగదీశ్వర్ గౌడ్ గారిని శాలువాతో ఘనంగా సత్కరించి తమ గౌరవాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమం హృద్యమైన వాతావరణంలో జరిగి, పరస్పర ఆత్మీయతకు నిదర్శనంగా నిలిచింది. ఈ వేడుక రాబోయే వివాహానికి శుభసూచకంగా మారి, కుటుంబ సభ్యులు మరియు మిత్రులందరిలో ఆనందాన్ని నింపింది.

## శంషాబాద్ విమానాశ్రయంలో 2 కోట్ల విలువైన విదేశీ గంజాయి పట్టివేత

- జాయింట్ ఆపరేషన్ తో లేడీ కిలాడి ఆట కట్టించిన డీఆర్ఐ, కస్టమ్స్ అధికారులు
- 6.150 కేజీల హైడ్రోపోనిక్ గంజాయి స్వాధీనం
- బ్యాంకాక్ నుండి హైదరాబాద్ వచ్చిన గంజాయి స్మగ్లర్
- నిందితురాలిపై ఎన్.డి.పీ.ఎస్ యాక్ట్ కింద కేసు నమోదు





**రాజేంద్రనగర్, ఏప్రిల్ 28 (నగరనిజం ప్రతినిధి)** శంషాబాద్ విమానాశ్రయంలో విదేశీ గంజాయి స్మగ్లింగ్ కు అడ్డుకట్ట వేయడానికి అటు డీఆర్ఐ,కస్టమ్స్ అధికారులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడడం లేదు. ప్రయాణికుల ముసుగులో బ్యాంకాక్, థాయిలాండ్ దేశాల నుండి హైదరాబాద్ వస్తున్న గంజాయి స్మగ్లర్లు.... కోట్లాది రూపాయల విలువచేసే విదేశీ గంజాయి (హైడ్రోపోనిక్) ని హైదరాబాద్ కు తరలిస్తున్నారు. కానీ డీఆర్ఐ, కస్టమ్స్ అధికారుల ముందు వీరి కుప్పి గంతులు సాగడం లేదు. సినీ ఫక్కీలో కిలోలకొద్దీ విదేశీ గంజాయిని మోసుకొస్తూ అడ్డంగా దొరికిపోతున్నారు. తాజాగా మంగళవారం నాడు బ్యాంకాక్ నుండి హైదరాబాద్ వచ్చిన ఓ లేడీ కిలాడి.... 6 కేజీలకు పైగా హైడ్రోపోనిక్ గంజాయిని తరలిస్తూ అధికారులకు అడ్డంగా దొరికిపోయింది. శంషాబాద్ విమానాశ్రయం కస్టమ్స్ అధికారుల కథనం ప్రకారం ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం నాడు బ్యాంకాక్ నుండి ఎయిర్ ఏసియా విమానంలో హైదరాబాద్ వచ్చిన ఓ భారతీయ ప్రయాణికురాలు. 6.150 కిలోల హైడ్రో పోనిక్ గంజాయిని లగేజ్ బ్యాగుల్లో దాచుకొని వచ్చింది. కస్టమ్స్ అధికారులకు ఏమాత్రం అనుమానం రాకుండా హైడ్రోపోనిక్ గంజాయిని 16 ప్యాకెట్లలో అమర్చుకొని శంషాబాద్ విమానాశ్రయంలో ల్యాండ్ అయింది. అయితే అప్పటికే పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన డీఆర్ఐ అధికారులు శంషాబాద్ విమానాశ్రయంలో ప్రస్తుతం అధికారులను అప్రమత్తం చేసి జాయింట్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ మేరకు 16 ప్యాకెట్లలో అమర్చుకొని వచ్చిన 6.150 కిలోల విదేశీ గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ బహిరంగ మార్కెట్లో 2.15 కోట్లు ఉంటుందని కస్టమ్స్ అధికారులు ప్రకటించారు. ఈ మేరకు నిందితురాలిపై ఎన్.డి.పీ.ఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ప్రకటించారు.



# మేడే వేడుకలకు సిద్ధం కండి





- కమ్యూనిస్టు నేత పానుగంటి పర్వతాలు
- శంషాబాద్ లోని లేబర్ అడ్డా వద్ద కార్మికులతో కలిసి మేడే పోస్టర్ ను రిలీజ్ చేసిన పానుగంటి పర్వతాలు
- కేంద్రం తెచ్చిన లేబర్ కోడ్లను రద్దు చేసేదాకా ఉద్యమం ఆగదన్న పర్వతాలు

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 28 (నగరనిజం ప్రతినిధి)** మే 1న ప్రపంచవ్యాప్తంగా జరగనున్న కార్మిక దినోత్సవం మేడే ఉత్సవాలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు పిలుపునిచ్చారు. మే డే ఉత్సవాలను జయప్రదం చేస్తూనే కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ ల రద్దు కోసం ఉద్యమానికి సిద్ధం కావాలని ఆయన కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. మే 1న తలపెట్టిన మేడే ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం నాడు గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ శంషాబాద్ సర్కిల్ పరిధిలోని లేబర్ అడ్డా వద్ద సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాచమల్ల యాదగిరి, సీపీఐ శంషాబాద్ మండల కార్యదర్శి నర్రాగిరి తో పాటు కార్మికులతో కలిసి మే డే పోస్టర్ ను ఆవిష్కరించారు ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి మాట్లాడిన పానుగంటి పర్వతాలు.... అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం మే డే వేడుకలను జయప్రదం చేయడానికి కార్మిక లోకం కదలి రావాలని పిలుపునిచ్చారు. కార్మికులంతా సంఘటితమై మే డే ఉత్సవాలను జయప్రదం చేయాలని దిశా నిర్దేశం చేశారు. మరోవైపు కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక లోకానికి వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసేదాకా ఏఐటీయూసీ అలుపెరుగని పోరాటం కొనసాగిస్తుందని పానుగంటి పర్వతాలు ప్రకటించారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని ఆయన మండిపడ్డారు. కార్మికుల హక్కులను కాలరాసే విధంగా ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని పానుగంటి పర్వతాలు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న నిలవకుశ విధానాలపై రాజీలేని పోరాటం కొనసాగిస్తామని పర్వతాలు ప్రకటించారు. ఇందుకోసం కార్మిక లోకాన్ని ఏకం చేస్తామని చెప్పారు. కార్మిక లోకానికి అండగా నిలిచేది ఒక ఎర్ర జెండా మాత్రమేనని ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాచమల్ల యాదగిరి, పార్టీ మండల కార్యదర్శి నర్రాగిరి, పార్టీ నేతలు ప్రవీణ్ కుమార్ గౌడ్, రాజేందర్ గౌడ్, శ్రీను తదితర కార్మికులు పాల్గొన్నారు.

## కెసిఆర్... ఒక గతం



- రేవంత్ రెడ్డి.. భవిష్యత్తు
- మెట్టు సాయికుమార్
- చైర్మన్ ఫిషరీస్

**హైద్రాబాద్ ఏప్రిల్ 28 (నగరనిజం న్యూస్):**కెసిఆర్... ఒక గతం రేవంత్ రెడ్డి.. భవిష్యత్తు అని ఫిషరీస్ కార్పొరేషన్ చెర్మెన్మెట్టు సాయికుమార్ అన్నారు.మంగళవారం గాంధీ భవన్ లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ దీతీం పార్టీ వారి కమిటీలను రద్దు చేసింది.. కానీ బిఆర్ఎస్ పార్టీని తెలంగాణ ప్రజలు రద్దు చేసారు...కుటుంబ పాలనా.. కోసం కెసిఆర్ ఆరాట పడుతున్నారని ఎద్దేవా చేశారు.

## నమ్మకంతో వెళ్తే నట్టేట ముంచుతున్న శ్రీకృష్ణ హీరో షోరూం

- ఒక వస్తువుకు బదులు మరో వస్తువును బిగిస్తున్న వైనం
- వినియోగదారులతో దురుసుగా ప్రవర్తిస్తున్న అడ్వైజర్లు




**మహేశ్వరం ఎప్రిల్ 28, (నగరనిజం)** : మహేశ్వరం మండల పరిధిలోని తుక్కుగూడ స్థానిక శ్రీకృష్ణ హీరో బైక్ షోరూం సర్వీస్ సెంటర్లో సరైన అనుభవం లేని మెకానిక్లను నియమించడం వల్ల వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. వాహనాలను సరిగా పరిశీలించకుండా పైపైగా చెక్ చేసి పంపిస్తున్నారని, ఒక సమస్యకు సంబంధించిన భాగాన్ని మార్చాల్సి ఉండగా మరో భాగాన్ని మార్చి సమస్య పరిష్కారమైందని చెప్పి వినియోగదారులను తప్పుదోవ పట్టిస్తున్నారని వారు వాపోతున్నారు. వాహనంలో ఉన్న అసలు సమస్య అలాగే ఉండిపోవడంతో తిరిగి సర్వీస్ సెంటర్కు వెళ్లినప్పుడు అక్కడి అడ్వైజర్లు వినియోగదారులతో ఇష్టానుసారంగా, దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలుమార్లు సమస్యను వివరించినా సరైన స్పందన లేకపోవడంతో వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా హీరో షోరూం యాజమాన్యం స్పందించి అనుభవజ్ఞులైన మెకానిక్లను నియమించి, వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని, అలాగే సిబ్బంది ప్రవర్తనపై పర్యవేక్షణ పెంచాలని వినియోగదారులు కోరుతున్నారు. లేదంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

## సింహాచలం అప్పన్నను దర్శించుకున్న సీఎం చంద్రబాబు

**విశాఖ:** సింహాచలం వరాహ లక్ష్మీ నరసింహ స్వామిని సీఎం చంద్రబాబు దర్శించుకున్నారు. సీఎంతోపాటు కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర హోం మంత్రి అనిత స్వామివారి సేవలో పాల్గొన్నారు. వీరికి పూర్ణ కుంభంతో వేద పండితులు స్వాగతం పలికి వేదాశీర్వచనాలు ఇచ్చారు. అనంతరం సిరిపురం వీఎంఆర్డీఏకు సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెళ్లారు. రైల్వే జోన్ కార్యాలయాన్ని సందర్శించారు.

# అధికారులు ప్రజలతో బాధ్యతగా వ్యవహరించాలి





- కేసిఆర్ పథకాలు పేదలకు ఎంతో అండగా నిలిచేవి
- మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**మహేశ్వరం ఎప్రిల్ 28 ,(నగరనిజం)** : అధికారులు ప్రజల పట్ల ఎంతో బాధ్యతతో వ్యవహరించాలని మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సూచించారు. మంగళవారం మహేశ్వరం ఎమ్మార్వో కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సభవట్ కృష్ణ నాయక్ తో కలిసి లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో రాజకీయాలకు తావు లేకుండా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందించే సహాయం పారదర్శకంగా చేరాలని ఆమె సూచించారు. మంత్రులు ఎమ్మెల్యేలు వచ్చినప్పుడే చెక్కులు పంపిణీ చేయాలనే విధానాన్ని పక్కకు పెట్టాలన్నారు. స్థానిక ఎమ్మార్వో కార్యాలయం ద్వారా లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయాలని ఆమె అధికారులకు సూచించారు. ఆడబిడ్డ పెళ్లికి అత్యవసర సమయంలో ప్రభుత్వం అందించే హార్దిక సాహాయం ఆ కుటుంబాలకు ఎంతో ఊరట నిస్తుందని ఆమె అన్నారు. గతంలో కేసీఆర్ ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్టు కళ్యాణ్ లక్ష్మి వంటి పథకాలు వేలాది కుటుంబాలకు ఎంతో అండగా నిలిచాయని ఆమె గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం ఎమ్మార్వో చిన్నప్పల్ నాయుడు, సర్పంచ్ మునగపాటి నవీన్, ఉప సర్పంచ్ జోరల రమేష్, కర్రోల చంద్రయ్య ముదిరాజ్, మంచే పాండు యాదవ్ వెంకటేశ్వర రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు ఉపసర్పంచ్లు వార్డ్ మెంబర్లు భారీగా పాల్గొన్నారు.

# ప్రజల ఆర్థికాభివృద్ధికి సహకార సంఘాలు దోహదం





- సహకార సంఘం జిల్లా అధికారి పి.సుధాకర్
- ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సహకార సంఘాలపై అవగాహన సదస్సు

**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 28 ( నగరనిజం ) :** ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్, హైదరాబాద్ మరియు కో-ఆపరేటివ్ క్లబ్ ఇబ్రహీంపట్నం సర్కిల్ వారి సౌజన్యంతో కళాశాల వాణిజ్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'సహకార సంఘాలపై అవగాహన సదస్సు'నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రాధిక అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా జిల్లా సహకార అధికారి పి.సుధాకర్, రిసోర్స్ పర్సన్ గా బి.ఆంజనేయులు ప్రసంగించారు. జిల్లా సహకార అధికారి పి.సుధాకర్ మాట్లాడుతూ... విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి సివిల్ సర్వీస్ మరియు పోటీ పరీక్షల సన్నద్ధతకు సహకార సంఘాల విషయ అవగాహన చాలా ప్రాముఖ్యమైనదని తెలిపారు. విద్యార్థులు అనేక వ్యవసాయ, పాడి, చేనేత మరియు ఇతర సహకార సంఘాల గురించి తెలుసుకోవాలని అందుకొరకు విద్యార్థులకు హాస్టల్ వసతితో పాటు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రాధిక మాట్లాడుతూ.. సహకార సంఘాలు ప్రజల ఆర్థిక అభివృద్ధికి ఎంతో తోడ్పాటుగా ఉంటాయని, అమూల్ లాంటి సంస్థ ఒకప్పుడు సహకార సంఘంగా ప్రారంభమై గొప్ప సంస్థగా ఎదిగిందని గుర్తు చేశారు. విద్యార్థులు ఉద్యోగ, ఉపాధి రంగాలలో ముందుకు సాగడానికి కళాశాల విద్య కమిషనర్ రెగ్యులర్ కోర్స్ తో పాటు ఇంటర్న్ షిప్ వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రవేశపెడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి ఎన్.సురేష్ వ్యవహరించగా ఇబ్రహీంపట్నం అసిస్టెంట్ రిజిస్టర్ ఎం.రవికుమార్, నాగేశ్వర్, గణేష్, రాఘవేందర్ వైస్ ప్రిన్సిపల్ డా.కె.సురేష్ అధ్యాపకులు డాక్టర్ శంకర్, డిఎస్ఎస్ఆర్ కృష్ణ, నరేందర్ రెడ్డి, డాక్టర్ రమేష్ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# కవిత పార్టీ తెలంగాణ రాష్ట్ర సేన'నా, 'తెలంగాణ. రావుల సేన'నా లేక 'రేవంత్ రెడ్డి సేన'నా?


- బ్లూ ఇండియా పార్టీ అధ్యక్షులు బొగ్గు ప్రసాద్




హైద్రాబాద్ ఏప్రిల్ 28 (నగరనిజం న్యూస్) 'తెలంగాణ రాష్ట్ర సేన' అనే పేరుతో కవిత తెలంగాణలో ఒక కొత్త రాజకీయ పార్టీని ప్రారంభించడం ఒక ముఖ్యమైన మలుపు. కాలం గడిచే కొద్దీ, ౹=౽ా అంటే ఏమిటో మనం తెలుసుకోవాలి: అది 'తెలంగాణ రాష్ట్ర సేన'నా, 'తెలంగాణ. రా వుల సేన'నా (ప్రజల సేన), లేక 'రేవంత్ రెడ్డి సేన'నా? ఇక్కడ ప్రధానంగా లేవనెత్తిన అంశం సామాజిక న్యాయం. నిజమైన సామాజిక న్యాయం అంటే, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు మరియు ఇతర వర్గాలకు వారి జనాభా నిష్పత్తికి అనుగుణంగా పాలనలోనూ, అన్ని రంగాలలోనూ వాటా దక్కడం మాత్రమే. కవిత చెప్పే 'సామాజిక న్యాయం', కాంగ్రెస్, బిజెపీ లేదా బిఆర్ఎస్ పార్టీలు చెప్పేది ఒక్కటేనా? ఒక కఠినమైన సత్యాన్ని మనం ఎదుర్కోవాలి తెలుగు రాష్ట్రాల్లో జనాభాలో, ఓటర్లలో మరియు పౌరులలో ఎక్కువ మందిగా ఉన్నప్పటికీ, బీసీలకు ఇప్పటి వరకు ఏ రాజకీయ పార్టీ కూడా ముఖ్యమంత్రి పదవిని అందించలేదు. 'తెలంగాణ రాష్ట్ర సేన' అధికారంలోకి వచ్చి, మొదటిసారిగా ఒక బీసీ నాయకుడిని ముఖ్యమంత్రిగా నియమిస్తే, అది నిజమైన సామాజిక న్యాయం అవుతుంది. అయితే, సామాజిక న్యాయం పేరుతో కవిత మళ్ళీ ముఖ్యమంత్రి అయితే, అది దిగువ కులాలకు గల అన్యాయమే తప్ప సామాజిక న్యాయం కాదు. ఇది సామాజిక తెలంగాణ కాదు. అభివృద్ధి పేరుతో దోపిడి చేస్తూ, అధికారపు ఫలాలను ఆస్వాదిస్తూ కవిత గారు స్పష్టంగా మౌనం పాటించారు. కానీ తన అవసరం కోసం ఇప్పుడు అకస్మాత్తుగా ఆమెకు సామాజిక న్యాయం గుర్తొచ్చింది . ఉద్యమకారులపై ఒక్కొక్కరిపై అన్యాయం జరుగుతూ ఉండగా, అప్పుడు మాట్లాడలేదు. అది ఆమె వరకు వచ్చేసరికి స్వంత ప్రయోజనాల కోసం మాత్రమే కొత్త పార్టీ మరియు సామాజిక న్యాయం గురించి మాట్లాడుతున్నారు. దీని నుండి స్పష్టమవుతోంది: మీ అజెండా వ్యక్తిగతం, సామాజిక న్యాయం కాదన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి ఉద్యమం యొక్క మొదటి మరియు రెండవ దశలలో అనేక మంది అమరవీరులు తమ ప్రాణాలను త్యాగం చేశారు. కార్మికుల నుండి రైతుల వరకు, అటెండర్ స్థాయి నుండి IAS అధికారుల వరకు ప్రతి ఒక్కరూ పాల్గొని, ఢిల్లీ మెడలు వంచి రాష్ట్రాన్ని సాధించారు. ఈ గొప్పతనం ఉద్యమానికి మరియు అమరవీరుల త్యాగానికి చెందినది. అనేక కవులు, కళాకారులు తమ జీవితాలను అర్పించి, మన పోరాట బలం ప్రపంచానికి చూపించారు. అయితే, ఉద్యమంలో చిట్టెలుకలా దూరిన కవిత గారు, లిక్కర్ కేసులో ఢిల్లీలో తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు. ఇది నిజం కాదా? మనం ఢిల్లీ లో తెలంగాణ విముక్తి కోసం ధైర్యంగా పోరాడినా, చివరికి దోపిడీదారుల కుటుంబం చేతుల్లోకి రాష్ట్రం వెళ్లింది. కవిత గారు ఆ దోపిడీదారుల కుటుంబానికి చెందినవారు. మీరు దోచుకున్న సొమ్ము ఎక్కడ ఉంది? మీరు పార్టీ పెట్టారు, దానిని నడపడానికి నిధులు ఎక్కడి నుండి వస్తున్నాయి? ప్రజలకు స్పష్టం చేయాలి.దీని అర్థం స్పష్టం: మీరు కూడా ఆ దోపిడీలో భాగస్వామ్యం వహించారు. 'బంగారు తెలంగాణ' అనే నినాదం 'సామాజిక తెలంగాణ' నిర్మాణాన్ని అడ్డుకునే ప్రయత్నంలో మీ భాగస్వామ్యం కూడా ఉన్నది మీరు మీ కుటుంబానికి బంగారు జీవితం అందింది తెలంగాణ ప్రజలకు కాదన్నారు.అలాగే, 'దొరల' పాలన తర్వాత 33% మహిళా రిజర్వేషన్ బిల్లుతో 'దొరసానుల' పాలన కు మార్గం సుగమమైంది. రేపు ఇలాంటి పరిణామాలే జరుగుతాయని దీనికి సాక్ష్యం. దొరల పాలన తొలగిపోతుందని మనం భావించిన 'తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ, దొరసానుల పాలనను తీసుకువస్తుంది. కాబట్టి, జాగ్రత్త!అని హెచ్చరించారు.

## రామాయపల్లి గ్రామ సభలో చెరువు కాలుష్యం, అక్రమ నిర్మాణాలపై ఆందోళన.

- ముఖ్యమంత్రి హైడ్రాతో అక్రమణాలను తొలగిస్తుంటే, అక్రమార్కులు చెరువులు కుంటలను కబ్జా చేస్తున్నారు.
- రామాయపల్లి పెద్ద చెరువులో మురికి నీరు-గ్రామస్తుల ఆగ్రహం
- ప్రైవేట్ వెంచర్ కబ్జాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- పైప్లైన్ ద్వారా డ్రైనేజీ నీరు చెరువులోకి -జీవరాసులకు ముప్పు
- ఫిల్టర్ బెడ్ ఏర్పాటు చేసి నీరు వదలాలని విజ్ఞప్తి
- గ్రామ సమస్యలపై అధికారులకు నివేదించిన గ్రామస్తులు.




**మెదక్ బ్యూరో :**మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని రామాయపల్లి గ్రామంలో కొన్ని రోజుల క్రిందట జరిగిన గ్రామ సభలో పెద్ద చెరువు కాలుష్యం, అక్రమ నిర్మాణాలపై గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మనోహరాబాద్ నుండి పైప్లైన్ ద్వారా వస్తున్న డ్రైనేజీ నీరు రామాయపల్లి పెద్ద చెరువులో కలవడంతో నీరు పూర్తిగా కలుషితమైందని గ్రామస్తులు ఆరోపించారు. గతంలో ఈ చెరువులో గ్రామ ప్రజలు స్నానం చేసేవారని, ప్రస్తుతం ఆ నీటిలో స్నానం చేస్తే దురద వంటి సమస్యలు వస్తున్నాయని తెలిపారు. అలాగే చెరువును ఆక్రమించి ప్రైవేట్ వెంచర్ నిర్మాణాలు చేపడుతున్నారని, వాటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. డ్రైనేజీ నీటిని శుద్ధి చేసి వదిలేలా ఫిల్టర్ బెడ్ ఏర్పాటు చేయాలని, సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేయాలని కోరారు. గ్రామంలో విద్యుత్, వైద్యం వంటి ఇతర సమస్యలను కూడా గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ గ్రామ సభలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులు, గ్రామ కార్యదర్శి మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలు ఉదయం పూటనే పనులు చేయాలి

### నెర్రపల్లి గ్రామ సర్పంచ్ గోడేండ్ల హేమలత శ్రీహరి



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 28 ( నగరనిజం ) :** ఉపాధి హామీ కూలీలు ఉదయం పూట మాత్రమే పనులు చేయాలని నెర్రపల్లి గ్రామ సర్పంచ్ గోడెండ్ల హేమలత శ్రీహరి అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండలం నెర్రపల్లి గ్రామంలో సర్పంచ్ గొడ్డెండ్ల హేమలత శ్రీహరి ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ హేమలత మాట్లాడుతూ... ఎండలు ఎక్కువ ఉన్నందున ఉపాధి కూలీలు ఉదయం 6 గంటల నుంచి 11 గంటల లోపు మాత్రమే పని ప్రదేశానికి వెళ్లి పనులు చేయాలని తెలిపారు. అదే విధంగా గ్రామపంచాయతీ తరపున కల్పించిన నీటిని తాగుతూ చల్లని ప్రదేశంలో మధ్య మధ్యలో కూర్చొని పని చేసుకోవాల్సిందిగా తెలిపారు. అనంతరం 85 మందికి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజ్ కుమార్, వార్డు సభ్యులు రేణుకా శ్రీనివాస్, అంగన్వాడి టీచర్ అమరావతి, ఆశా వర్కర్ సంతోష, ఉపాధి కూలీలు ప్రశాంత్, భార్గవ్, లావణ్య, మౌనిక, సత్తిరెడ్డి, గ్రామపంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలి

- బీఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి.రాజ్ కుమార్




**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 28 ( నగరనిజం ) :** పెండింగులో ఉన్న 8 వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి.రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. ఫీజుల కొరకై బీఆర్ఎస్వీ చేపట్టిన పోరుబాట 2వ రోజు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఇబ్రహీంపట్నం సెయింట్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులను కలిసి పెండింగ్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేసేవిధంగా రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తికి పోస్ట్ కార్డుల ద్వారా ఫిర్యాదు చేశారు. విద్యార్థులు పెద్దఎత్తున ఉత్తరాలు రాశారు. ఈ సందర్భంగా పి.రాజ్ కుమార్ మాట్లాడుతూ... 8 వేల కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిధులు విడుదల చేయకపోవడం వల్ల పై తరగతులకు వెళ్ళడానికి అదేవిధంగా ప్రభుత్వ, ప్రవేటు ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్న ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం వల్ల ఉద్యోగ అవకాశాలు కోల్పోవడం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసి ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చి, రెండున్నర సంవత్సరాలు దాటినా ఇప్పటివరకు చెల్లించకపోవడం వల్ల విద్యార్థులు మానసిక శోభనకు గురై సరైన విద్యను పొందలేకపోతున్నారని వాపోయారు. ఇప్పటికైనా ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ సీనియర్ నాయకులు శ్రావణ్, ఎలిమినేటి ప్రశాంత్, బాల్మీకి సుభాష్, రవి, ప్రసాద్, శంకర్, ప్రవీణ్, శివ, తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్‌లో పెట్రోల్ కష్టాలు

- పెట్రోల్, డీజిల్ లేక మూతపడ్డ పలు బంకులు
- సిద్ధాంతి ఐఓసి పెట్రోల్ బంక్ వద్ద పెట్రోల్ కోసం భారీగా వాహనదారుల క్యూ లైన్
- పెట్రోల్ కష్టాలతో వాహనదారుల అవస్థలు





**రాజేంద్రనగర్, ఏప్రిల్ 28 (నగరనిజం ప్రతినిధి) :**పెట్రోల్, డీజిల్ కొలత లేదంటూ ఒకవైపు పాలకులు నెత్తీ,నోరూ బాదుకుంటున్నప్పటికీ హైదరాబాద్ శివారులోని శంషాబాద్ లో మాత్రం వాహనదారులను పెట్రోల్ కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఎక్కడ చూసినా పెట్రోల్ బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తుండడంతో వాహనదారులు తలలు పట్టుకుంటున్నారు. పశ్చిమాసియా కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ కొరతతో శంషాబాద్ లోని పెట్రోల్ బంకులన్నీ మూతపడ్డాయి. ఒకే ఒక్క పెట్రోల్ (ఇండియన్ ఆయిల్) బంకు లో మాత్రమే పెట్రోల్ డీజిల్ అందుబాటులో ఉండడంతో వాహనదారులు కిలోమీటర్ మేర బారులు తీరారు. ఇరాన్ తో ఇజ్రాయిల్ అమెరికా దేశాల యుద్ధం నేపథ్యంలో గడిచిన రెండు నెలలుగా ప్రపంచ దేశాలన్నీ అల్లాడిపోతున్నాయి. ప్రధానంగా గ్యాస్, సీఎన్జీ తో పాటు పెట్రోల్, డీజిల్ కష్టాలు వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. సీ ఎన్జీ కొరతతో ఇప్పటికే చాలా చోట్ల సీఎన్జీ బంకులన్నీ మూతపడగా తాజాగా పెట్రోల్, డీజిల్ కొరతతో తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడికక్కడ పెట్రోల్ బంకులు మూతపడుతున్నాయి. ఎక్కడ చూసినా బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు వేలాడుతుండడంతో పెట్రోల్, డీజిల్ దొరక్క వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ పరిధిలోని శంషాబాద్ పరిధిలో దాదాపు పది పెట్రోల్ బంకులు ఉండగా... దాదాపు అన్ని బంకులు మూతపడ్డాయి. పెట్రోల్, డీజిల్ అందుబాటులో లేకపోవడంతో పెట్రోల్ బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు పెట్టారు. శంషాబాద్ పరిధిలోని సిద్ధాంతి వద్ద ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కు చెందిన (జైత్రి) పెట్రోల్ బంకు మాత్రమే తెరిచి ఉండడంతో పెట్రోల్, డీజిల్ కోసం ఇక్కడ వాహనదారులు ఎగబడ్డారు. కిలోమీటర్ మేర క్యూలైన్ ఉండడంతో హైదరాబాద్ బెంగళూరు జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మరోవైపు పెట్రోల్, డీజిల్ కోసం వాహనదారులు బారులు తీరి నిల్చుండడంతో శంషాబాద్ ఆర్.జి.ఐ.ఏ ట్రాఫిక్ పోలీసులు బంకుల వద్ద వాహనాలను నియంత్రించడానికి అన్నట్లుగా విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి తోడు పెట్రోల్ డీజిల్ కొరత నేపథ్యంలో త్వరలోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెరగబోతున్నాయనే పుకార్లు షికార్లు చేస్తుండడంతో వాహనదారుల తో పాటు జనం సైతం ప్లాస్టిక్ క్యాన్లతో బంకుల వద్ద ఎగబడుతున్నారు. దీంతో తెరిచి ఉన్న బంకు వద్ద పెట్రోల్ డీజిల్ కోసం జనం నువ్వా నేనా అన్నట్టుగా కుస్తీ పోటీలు పడుతున్నారు.






## కాలాకల్ కట్టుగాలువ కబ్జాలు

- అధికారులు నిర్లక్ష్యం, చర్యల కోసం ప్రజల డిమాండ్.
- ప్రభుత్వం హైడ్రా తో అభివృద్ధి చేస్తుంటే, అక్రమార్కులు చెరువులు కుంటలు నాళాలు కబ్జాకు దిగుతున్నారు
- చెరువులు నాలా,కబ్జా చేస్తున్న వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలి: ప్రజాసంఘాలు



**మెదక్ బ్యూరో । నగర నిజం:** మనోహరాబాద్ మండలంలోని కాలాకల్ గ్రామంలో కట్టుగాలువపై భారీ స్థాయిలో కబ్జాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం పై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎస్బీఐ బ్యాంకు పరిసరాల నుంచి ప్రారంభమయ్యే ఈ కట్టుగాలువ సుమారు రెండున్నర నుండి మూడు కిలోమీటర్ల వరకు విస్తరించి ఉన్నప్పటికీ, అనేక ప్రైవేట్ వెంచర్లు ఆక్రమించడంతో కాలువ ఆకృతి పూర్తిగా దెబ్బతిన్నది. కాలువ వెడల్పు 33 అడుగులు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో అది 3 అడుగులు, 6 అడుగులు, 9 అడుగుల మేరకు మాత్రమే మిగిలి నీటి ప్రవాహం సరిగా లేకపోవడం వల్ల వరదలు మరియు కాలుష్య సమస్యలు తలెత్తుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ముఖ్యంగా కాలాకల్ క్లాసిక్ దాబా వెనకాల నుంచి చెరువు వరకు ఉన్న భాగంలో పెద్ద ఎత్తున కబ్జాలు జరిగాయని ఆరోపిస్తున్నారు. గ్రామసభలో ఈ అంశంపై చర్చిస్తూ తాసిల్దార్ దృష్టికి తీసుకెళ్లిన గ్రామస్తులు, ప్రసాద్ వెంచర్ పరిధిలో ఉన్న డంప్ యార్డ్‌ను వెంటనే తొలగించి, నీరు మరియు వాతావరణ కాలుష్యాన్ని నివారించే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితి ప్రజలకు ఆరోగ్యపరంగా హానికరమని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా సంఘాలు హైడ్రా (HYDRA) ద్వారా ఈ అక్రమ కబ్జాలపై తక్షణ చర్యలు తీసుకుని కాలువను పునరుద్ధరించాలని కోరుతున్నాయి. నెలలు గడుస్తున్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## బాల్యవివాహం బతుకు ఆగంలి బాల్య వివాహాలు రహిత జిల్లాగా మెదక్ ను తీర్చిదిద్దాలి





- అదనపు కలెక్టర్ నగేష్.

**మెదక్ బ్యూరో :నగర నిజం: 28 ఏప్రిల్ 2026** ప్రజాపాలన 99 రోజుల ప్రగతి ప్రణాళికా కార్యక్రమంలో భాగంగా మెదక్ పట్టణం రాందాస్ చౌరస్తాలో మహిళా,శిశు, దివ్యాంగుల, మరియు వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో బాల్యవివాహం బతుకు ఆగం అనే నినాదంతో రాందాస్ చౌరస్తాలో మానవహారం చేపట్టారు.. ఈ కార్యక్రమానికి మెదక్ అదనపు కలెక్టర్ నాగేష్ మెదక్ మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బాల్య వివాహాన్ని ఆపి ఆరోగ్యకరమైన, విద్యావంతమైన సురక్షిత సమాజాన్ని నిర్మించాలని మెదక్ అదనపు కలెక్టర్ నగేష్ సూచించారు.. బాలికల సంరక్షణ కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అనేక చట్టాలు హక్కులు తీసుకువచ్చిందని వాటిని సద్వినిగం చేసుకోవాలని కోరారు అనంతరం బాల్యవివాహాలను రద్దు చేయాలని ప్రతిజ్ఞ చేశారు..బాల్య వివాహాల నివారణకు ప్రతి ఒక్కరికి సంపూర్ణ అవగాహన కల్పించాలని బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి,డీఎఫ్.ఓ జోజి, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటస్వామి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, డీఈఓ విజయ, యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్ ఇతర శాఖల జిల్లా అధికారులు ప్రజా ప్రతినిధులు వార్డు కౌన్సిలర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన సంస్కృత భాష శిబిరం

- సంస్కృతంలో తర్ఫీదు పొందిన సాధకులు అదృష్టవంతులు
- రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు కటంగూరి సత్యనారాయణ రెడ్డి



**హన్మకొండ ఏప్రిల్ 28 (నగరనిజం న్యూస్)** హన్మకొండలో మూడు రోజుల ఉచిత సంస్కృత భాష శిబిరం నేడు ముగింపు సంస్కృతభారతి -- ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 26 నుండి 28 వరకు మూడు రోజులు ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సంస్కృత భాషపై ఆసక్తి ఉన్న వారికి ఉచిత సంస్కృత భాషా ప్రవేశవర్గల శిక్షణ శిబిరం కేఎల్ఎన్ రెడ్డి కాలనీ, హన్మకొండలోని శ్రీ రామకృష్ణ సేవా మందిరంలో ఘనంగా నిర్వహించబడింది. కేవలం మూడు రోజుల్లోనే సంస్కృతంలో సరళంగా మాట్లాడేలా ప్రత్యేక పద్ధతిలో శిక్షణను ఇచ్చిన సంస్కృత భారతి టీమ్ సభ్యులు అభినందనీయులని, సంస్కృతంలో తర్ఫీదు పొందిన సాధకులు అదృష్టవంతులని, సేవా సమితి అధ్యక్షులు కటంగూరి సత్యనారాయణ రెడ్డి అన్నారు. ఇకనుండి ప్రతి ఆదివారం యోగా, ధ్యానంతో పాటుగా, ఇంగ్లీష్ మరియు సంస్కృత భాషలో శిక్షణ ఇవ్వబడుటకు కార్యాచరణ ప్రణాళిక తయారు చేస్తున్నామని దాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిబిరంలో వరంగల్ సంస్కృత భారతి ప్రతినిధులు ఆనంద్, వరలక్ష్మి, సంపత్ కుమార్, పేట శ్రీనివాస్ దంపతులు, రామానంద సాగర్, రామన్న, కాకతీయ రచయితల వేదిక అవధాని చేకూరి శ్రీరామ్, దాత డాక్టర్ శివ రాణి, సేవా సమితి ప్రధానకార్యదర్శి ప్రభు చైతన్య, యువ విభాగ్ సభ్యులు నరేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# మల్కారంలో వివాదాస్పద భూమిలో జోరుగా అక్రమ నిర్మాణాలు





- **కలెక్టర్ తో పాటు పంచాయతీరాజ్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదంటున్న బాధితులు**
- **జీవో 111 నిబంధనలకు విరుద్ధంగా శరవేగంగా కొనసాగుతున్న షెడ్ల నిర్మాణం**
- **జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తో పాటు డీపీఓ కు ఫిర్యాదు చేసిన పిండి లావణ్య మహేందర్ రెడ్డి**

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 28 (నగరనిజం ప్రతినిధి):** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం లోని మల్కారం గ్రామ పంచాయతీ పరిధిలో వివాదాస్పద భూమిలో అక్రమ నిర్మాణం జోరుగా కొనసాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వివాదం కోర్టు పరిధిలో ఉన్న నేపథ్యంలో వివాదాస్పద భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణం పై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, స్థానిక గ్రామపంచా యతీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పిండి లావణ్య మహేందర్ రెడ్డి ఆరోపిస్తున్నారు. మరోవైపు జీవో 111 నిబంధనలకు విరుద్ధంగా షెడ్డు నిర్మాణం జరుగుతున్నప్పటికీ పట్టించుకోవాల్సిన అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు మంగళవారం నాడు శంషాబాద్ లో పిండి లావణ్య మహేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. పిండి లావణ్య మహేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.....రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం లోని మల్కారం వద్ద సర్వే నంబర్ 63 లోని 1.17 ఎకరాల భూమి అమ్మకానికి సంబంధించి పిండి లావణ్య మహేందర్ రెడ్డి వారి కుటుంబ సభ్యుల మధ్యన వివాదం కొనసాగుతోంది. కుటుంబ సభ్యుల మధ్యన ఆస్తి తగాదా నేపథ్యం లో లావణ్య మహేందర్ రెడ్డి ఈ వ్యవహారంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రస్తుతం ఈ వివాదం కోర్టు పరిధిలో ఉంది. ఈ వివాదం కోర్టు పరిధిలో కొనసాగుతూ ఉండగానే వివాదాస్పద భూమిలో ఓ వ్యాపారి అక్రమ నిర్మాణం చేస్తున్నట్లు లావణ్య మహేందర్ రెడ్డి ఆరోపించారు. ఈ వ్యవహారంపై స్థానిక గ్రామపంచాయతీ అధికారులతో పాటు మండల పంచాయతీరాజ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డికి సైతం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడం జరిగిందని బాధితురాలు లావణ్య మహేందర్ రెడ్డి వెల్లడించారు. అయితే జిల్లా కలెక్టర్ నుండి మొదలుకొని జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారుల వరకు ఫిర్యాదు చేసినప్పటికీ వివాదాస్పద భూమిలో జీవో 111 నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణం కొనసాగిస్తున్నారని ఆమె ఆరోపించారు. వివాదం కోర్టు పరిధిలో ఉన్నప్పుడు వివాదాస్పద స్థలంలో నిర్మాణానికి ఏ విధంగా అనుమతి ఇస్తారని బాధితురాలు ప్రశ్నిస్తున్నారు. గ్రామపంచాయతీ అధికారులు కావాలనే అక్రమ నిర్మాణం పట్ల చూసీ చూడనట్లుగా వదిలేస్తున్నారని ఆరోపించారు. అక్రమ నిర్మాణం పై స్థానిక గ్రామపంచాయతీ అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తుండడంతో పనులు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారి తక్షణమే జోక్యం చేసుకొని మల్కారం వద్ద సర్వే నెంబర్ 63 లోని వివాదాస్పద భూమిలో జీవో 111 నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన అక్రమ నిర్మాణం పై చర్యలు తీసుకోవాలని లావణ్య మహేందర్ రెడ్డి డిమాండ్ చేస్తున్నారు.

**అక్రమ నిర్మాణం పై నోటీసులు ఇచ్చాం - పంచాయతీ కార్యదర్శి రాజేందర్ రెడ్డి**

శంషాబాద్ మండలం లోని మల్కారం గ్రామపంచాయతీ పరిధిలో సర్వే నంబర్ 63 లోని వివాదాస్పద భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణానికి సంబంధించి నోటీసులు జారీ చేయడం జరిగింద గ్రామపంచాయతీ కార్యదర్శి రాజేందర్ రెడ్డి మీడియాకు తెలిపారు. సంబంధిత నిర్మాణదారుడికి నోటీసు జారీచేసి పనులు నిలిపివేయించినట్లు ఆయన స్పష్టం చేశారు.

# ఎన్నికల్లో ఓడిపోయాడు...అయినా మానవత్వం చాటుకున్నాడు





- **ముచ్చింతల్ లో నిరుపేద ఆడపిల్ల పెళ్లికి చీర సారే తో పాటు 11000 ఆర్థిక సాయం అందించిన గులాబీ నేత జొన్నాడ రాఘవేందర్**
- **రాఘవేందర్ కు కృతజ్ఞతలు చెప్పిన పెళ్లికూతురు కుటుంబ సభ్యులు**

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 28 (నగరనిజం ప్రతినిధి)** గ్రామ సర్పంచ్ గా ఎన్నికై ప్రజలకు సేవ చేయాలని భావించాడు....పంచాయతీ సంగ్రామంలో బరిలో నిలిచి కొద్దిపాటి ఓట్ల తేడాతో ఓటమిని చవిచూశాడు. ఫలితం.... ఓటమి బాధను దిగమింగుతూనే ఎన్నికల్లో ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక సాయం చేస్తాను అన్న మాటకు కట్టుబడి ఇచ్చిన హామీని నెరవేర్చాడు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా ఓ నిరుపేద పెళ్లికూతురుకి చీర, సారే తో పాటు 11000 ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నాడు గులాబీ పార్టీ యువ నేత, పాలమాకుల్ సహకార బ్యాంకు మాజీ డైరెక్టర్ జొన్నాడ రాఘవేందర్. మరోవైపు ఎన్నికల్లో ఓటమిపాలైనప్పటికీ ఇచ్చిన హామీకి కట్టుబడి పెళ్లికి ఆర్థిక సాయం అందించిన జొన్నాడ రాఘవేందర్ కు పెళ్లికూతురుతో పాటు పెళ్లికూతురు కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని ముచ్చింతల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ యువ నేత, పాలమాకుల్ సహకార బ్యాంకు డైరెక్టర్ జొన్నాడ రాఘవేందర్ గ్రామ సర్పంచ్ గా గెలిచి ప్రజలకు సేవ చేయాలని భావించాడు. ఈ మేరకు ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ స్థానానికి బీఆర్ఎస్ పార్టీ మద్దతుదారు అభ్యర్థిగా పోటీచేసి కొద్దిపాటి ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు. అయితే గ్రామపంచాయతీ ఎన్నికల్లో తనను సర్పంచ్ గా గెలిపిస్తే గ్రామ సమగ్ర అభివృద్ధికి పాటుపడడం, గ్రామ ప్రజలకు సేవ చేయడంతో పాటు గ్రామానికి చెందిన నిరుపేద ఆడపిల్లల పెళ్లిళ్లకు 11000 ఆర్థిక సాయం అందజేస్తానని హామీ ఇచ్చారు. అయితే సర్పంచ్ ఎన్నికల్లో ఓటమిపాలైనప్పటికీ ఒకవైపు బాధను దిగ మింగుతూనే మరోవైపు ఇచ్చిన హామీని నెరవేర్చుడానికి నడుం బిగించారు గులాబీ పార్టీ యువ నేత జొన్నాడ రాఘవేందర్. ముచ్చింతల్ గ్రామానికి చెందిన కత్తుల వసంత - జంగయ్య దంపతుల కూతురు అనూష వివాహం నిశ్చయమైంది. ఈ నేపథ్యంలో పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీకి కట్టుబడి మంగళవారం నాడు పెళ్లికూతురు అనూషకు చీర, సారే తో పాటు 11000 ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు జొన్నాడ రాఘవేందర్ –సుజాత దంపతులు. పెళ్లికూతురు ఇంటికి చేరుకున్న జొన్నాడ రాఘవేందర్ సుజాత దంపతులు.... పెళ్లికూతురు అనూష కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన జొన్నాడ రాఘవేందర్....తాను సర్పంచ్ గా గెలుపొందక పోయినప్పటికీ నిరుపేద ఆడపిల్లల పెళ్లిళ్ల కోసం ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటానని జొన్నాడ రాఘవేందర్ ప్రకటించారు. మరోవైపు ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ ఇచ్చిన హామీకి కట్టుబడి తమ కూతురి పెళ్లికి చీరే సారే తో పాటు 11000 ఆర్థిక సాయం అందజేసిన గులాబీ పార్టీ యువ నేత జొన్నాడ రాఘవేందర్ కు కత్తుల వసంత - జంగయ్య దంపతులతో పాటు పెళ్లికూతురు అనూష కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ముచ్చింతల్ పట్టణ అధ్యక్షుడు బానూరి శివశంకర్ తదితర పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆ వాహనాలకు భవిష్యత్తు లేదు

- **కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ**

**హైదరాబాద్,నగర నిజం:** డీజిల్, పెట్రోల్ వాహనాలకు భవిష్యత్తు లేదని, శిలాజ ఇంధన ఆధారిత రవాణా నుంచి త్వరగా బయటపడాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. మంగళవారం జరిగి న బస్ వరల్డ్ ఇండియా 2026 కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మన దేశంలో ప్రజారవాణా వ్యవస్థలో శిలాజ ఇంధనాలకు భవిష్యత్తు లేదని అన్నారు. హైడ్రోజన్, ఇథనాల్, సీఎన్జీ, ఎల్ఎన్జీ, ఎలక్ట్రిక్ వాహనాల వైపు మారాలని సూచించారు. భౌగోళిక రాజకీయ అస్థిరతల కారణంగా చమురు సరఫరా గొలుసులో ఆందోళనలు నెలకొన్న ప్రస్తుత తరుణంలో, ప్రత్యామ్నాయం చూడాలనే చర్చ సాగుతోంది. ఇలాంటి తరుణంలో గడ్కరీ కీలక వ్యాఖ్యలు చేశారు. బయోఫ్యూయల్ వంటి స్వదేశీ, స్వచ్ఛమైన ఇంధనాల వైపు మళ్లడం తప్పనిసరి అన్నారు. రవాణా రంగం తక్కువ ఖర్చుతో కూడిన, కాలుష్యరహిత, స్వదేశీ



పరిష్కారాలపై దృష్టి సారించాలని సూచించారు. ఖర్చు తగ్గించుకోవడానికి భద్రత, నాణ్యత విషయాల్లో రాజీపడకూడదని బస్సుల తయారీదారులను ఉద్దేశించి సూచించారు.

## స్కాలర్‌షిప్స్ బకాయిలను విడుదల చేయండి

- **ఏబీవీపీ వీరపట్నం జిల్లా కన్వీనర్ జగదీష్**



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 28 ( నగరనిజం ) :** పెండింగులో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ వీరపట్నం జిల్లా కన్వీనర్ పయ్యంశెట్టి జగదీష్ డిమాండ్ చేశారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ తెలంగాణ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మంగళవారం ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని మంగళపల్లి చౌరస్తాలో ఏబీవీపీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ వీరపట్నం జిల్లా కన్వీనర్ జగదీష్ మాట్లాడుతూ... గత 5 సంవత్సరాలుగా పెండింగులో 10 వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయకుండా కాలయాపన చేస్తోందని దుయ్యబట్టారు. ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు పదే పదే కౌంటర్ దాఖలు చేయాలని చెప్పిన అసలు వినకుండా ఆ పథకాన్ని ఎత్తివేసే కుట్రలో ఉన్నదని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్మెంట్ మరియు స్కాలర్షిప్ బకాయిలను విద్యార్థుల దగ్గరే వసూలు చేయాలని, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం హై కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడం బాధాకరమని అన్నారు. కాబట్టి ప్రభుత్వం వెంటనే పెండింగులో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ మరియు స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రుద్రపల్లి మహేందర్, భానుప్రసాద్, స్టేట్ టెక్నికల్ సెల్ కో కోనూర్ చింతల గుణవంత్ రెడ్డి, స్టేట్ వనవాసికో కో కోనర్ మునవత్ రాజేష్, స్టేట్ కో కన్వీనర్ పుప్పాల ఆదర్శ్, స్టేట్ సోషల్ మీడియా కో కన్వీనర్ వెంకటరమణ, విభాగ్ హాస్టల్స్ కన్వీనర్ దంతజు జ్యోతి ప్రసాద్, నగర కార్యదర్శి వినయ్, తదితరులు పాల్గొన్నారు.

## పర్కిబండలో బీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ

- **సర్పంచ్ మోతీబాయి లక్ష్మణ్ సింగ్ ,**



**మెదక్ బ్యూరో :నగర నిజం :** మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల పరిధిలోని పరికిబండ గ్రామంలో రాజకీయ ఉత్సాహం ఉరకలుపర్కిబండ గ్రామంలో బీఆర్ ఎస్ పార్టీ జెండాను ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రముఖుల సమక్షంలో కార్యక్రమంసర్పంచ్ మోతీబాయి లక్ష్మణ్ సింగ్ , మాజీ సర్పంచ్ అర్జున్ , మాజీ జెడ్పీటీసీ నారాయణ గౌడ్ , ఉప సర్పంచ్ మహేష్ , వార్డ్ సభ్యులు మరియు పాలకవర్గ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామ అధ్యక్షుడిగా బుర్రి కైతయ్య ఎంపికఈ సందర్భంగా బుర్రి కైతయ్య గారిని బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయనకు నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. యువత ఉత్సాహంగ్రామ యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సేవాదళ్ "సమర్ధ-శిక్షణ శిబిరం"లో టీపీసీసీ నేతలు



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 28 (నగర నిజం ప్రతినిధి):** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సేవాదళ్ ఆధ్వర్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏప్రిల్ 27 నుండి మే 2 వరకు నిర్వహిస్తున్న "సమర్ధ-శిక్షణ శిబిరం"లో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ శ్రీ వి. జగదీశ్వర్ గౌడ్ గారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ మిద్దెల జితేందర్ గారు, మియాపూర్ యువనాయకుడు యలమంచి ఉదయ్ కిరణ్, అలాగే శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ గారు మాట్లాడుతూ, సేవాదళ్ కేవలం ఒక సంస్థ కాదని, క్రమశిక్షణ, సేవా భావం, త్యాగం అనే విలువలపై నిలిచిన శక్తివంతమైన వేదిక అని పేర్కొన్నారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ప్రజల హక్కుల కోసం పోరాడుతూ, స్వాతంత్ర్య సమరం నుండి సామాజిక న్యాయం వరకు కీలక పాత్ర పోషించిందని తెలిపారు. "కాంగ్రెస్ అంటే సేవ... సేవ అంటే ప్రజల గెలుపు. ప్రజల పక్షాన పోరాటమే సేవాదళ్ ధర్మం" అని ఆయన అన్నారు. యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, దేశ నిర్మాణంలో వారి పాత్రను బలపరచడం, ప్రతి కార్యకర్తను సేవా దిశగా తీర్చిదిద్దడం ఈ శిక్షణ శిబిరం ప్రధాన ఉద్దేశమని వివరించారు. ఈ శిబిరం ద్వారా సేవాదళ్ కార్యకర్తలు నాయకత్వ నైపుణ్యాలు, ప్రజా సమస్యలపై అవగాహన, క్రమశిక్షణ, ఐక్యత వంటి విలువలను అలవరుచుకుంటారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్ నాయకులను తీర్చిదిద్దే వేదికగా ఈ శిక్షణ శిబిరం నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ నాయకులు విజయభాస్కర్ రెడ్డి, సౌందర్య రాజన్, ప్రణీత్, రత్నాచారి, సేవాదళ్ నాయకులు మరియు ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

Edited & printed and owner,publisher Yela purushotham,(Regd): H-No 11-21-890,Ntr Nagar,L.B nagar saroor nagar mandal,Rangareddy-Dist,500074, printed Y.p.s publication H-No 11-21-890,Ntr Nagar,L.B nagar, saroor nagar mandal,Rangareddy-Dist,TELANGANA-500074, Editor Yela purushotham.(H.O) : plot no:31,H-No 1-13,kuntloor road,Near hayathanagar,abdullapur mettu mandal,rangareddy dist,TELANGANA-501505,
RNI NO: APTEL/2013/54450.(PRGI) .PH NO:8247467562 Email; nagaranijam@gmail.com.Whatsapp no : 8247467562,WEBSITE: WWW.NAGARANIJAM.COM.TELANGANA STATE